# పౌరహక్కుల కోసం ఏ పార్టీ ఏం చేసింది ? ఏ అభ్యర్థి ఏం చేసారు?

## ఆలోచించండి ! ప్రశ్నించండి !!

వోటరులారా !

డిసెంబరు నెలలో మళ్ళీ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు వస్తున్నాయి. గడచిన నలభై ఏళ్లుగా ఎన్నికలు వస్తూనే ఉన్నాయి. అయిదేళ్లకొకసారే కాక ఈ మధ్య కాలంలో రెండు మూడేళ్లకొకసారి కూడ ఎన్నికలు వస్తున్నాయి.

ఎన్నికలు వస్తూనే ఉన్నాయి కానీ అసలు ఎన్నికలనేవి ఎందుకు జరుగుతాయో ప్రజలు మరచిపోయేటట్టు చేసారు మన పాలకులు.

పాలక పక్షాలు, ప్రతిపక్షాలు ఒకరి తరువాత ఒకరు అధికార సింహాసనం ఎక్కి కూర్చోవడం కోసమే అయిదేళ్లకొకసారి ఎన్నికలు పెట్టుకుంటారా? అందుకోసమేనా మనమంతా వోట్లు వేయవలసింది? అందుకోసమేనా కోట్ల రూపాయల ప్రజాధనంఖర్చయ్యేది? అని ఈ రోజు ఎవరికయినా సందేహం రావచ్చు.

ఏ పార్టీ దగ్గర సరయిన పరిపాలన విధానాలు ఉన్నాయో ఎన్నికలు నిర్ణయించాలి.

ఏ పార్టీ దగ్గర ఎక్కువ రౌడీబలం ఉందో ఎన్నికలు నిర్ణయిస్తున్నాయి.)

ఏ పార్టీ ప్రజలకు ఎక్కువ మేలు చేయగలదో ఎన్నికలు నిర్ణయించాలి.

ఏ పార్టీ ప్రజలకు ఎక్కువ డబ్బు, సారాయి, సరఫరా చేయ్యగలదో ఎన్నికలు నిర్ణయిస్తున్నాయి.)

ఏ అభ్యర్థి ప్రజల మెప్పు పొందగలరో ఎన్నికలు నిర్ణయించాలి.

ఏ అభ్యర్థి ప్రజలను బెదిరించి భయపెట్టి లోబరచుకోగలరో ఎన్నికలు నిర్ణయిస్తున్నాయి.)

ఏ అభ్యర్థికి ప్రజల సమస్యలు బాగా తెలుసో ఎన్నికలు నిర్ణయించాలి.

ఏ అభ్యర్థి పెద్ద గుంపును పోగుచేసి రిగ్గింగ్ చేయగలరో, దొంగవోట్లు వేసుకోగలరో ఎన్నికలు నిర్ణయిస్తున్నాయి.)

ప్రజాస్వామ్యం అంటే అయిదేళ్లకొకసారి ఎన్నికలు పెట్టుకొని ఎవడు ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టగలడో ఎవడు ఎక్కువ సారాయి పోయించగలడో, ఎవడు ఎక్కువ రౌడీయిజం చేయగలడో తేల్చుకోవడం కాదు.

ప్రజల సమస్యల పరిష్కారానికి ఒక సాధనంగా పనిచేయగలిగితేనే ఎన్నికలనేవాటికి అర్థం ఉంటుంది. లేకపోతే ఎన్నికలు జరుపుకోవడంలో అర్థం లేదు.

మీరు రేపు రాబోయే ఎన్నికలలో వోటు వేస్తారో, తేకపోతే వేయడం వల్ల ప్రయోజనం లేదనుకుంటే బహిష్కరిస్తారో మీ యిష్టం. వేయదలచుకుంటే ఏ పార్టీకి వేస్తారో మీ యిష్టం. అయితే ఏ నిర్ణయం తీసుకున్నా మీ సమస్యల పరిష్కారంతో సంబంధం లేని నిర్ణయం తీసుకోవద్దు.

పౌరహక్కుల సంఘంగా మేము కొన్ని ప్రశ్నలు మీముందు పెడుతున్నాం. వాటిని గురించి ఆలోచించండి. **అభ్యర్థులనూ పార్టీలనూ ప్రశ్నించండి.**

## ☆ అసలు వోటుహక్కు అందరికీ ఉందా?

ఎన్నికలు మళ్లీ మళ్లీ పెడుతూనే ఉన్నారు కానీ అసలు సమాజంలో అందరికీ వోటుహక్కు ఉందా? మాల మాదిగలు, ఇతర దళిత కులాలు బ్యాలట్ పేపర్ ముఖం చూసి ఎరుగని గ్రామాలు ఎన్నిలేవు? 'ఈ నలభై ఏళ్లలో మేము వోటువేసి ఎరుగము' అని దళితులు వాపోయే గ్రామాలు ఎన్నిలేవు?

కొన్ని గ్రామాలలో దళితుల వోట్లు అగ్రకులాల వాళ్లు వేసుకుంటారు. కొన్ని గ్రామాలలో దళితులు స్వంతంగా వోట్లు వేసుకోవచ్చుగానీ అగ్రకులాలు చెప్పినట్టు వెయ్యాలి. లేకపోతే హింసిస్తారు.

కొన్నిగ్రామాలలో దళితుల వోట్లే కాదు, ఊరందరి వోట్లూ పెత్తందార్ల మనుషులే గుద్దుకుంటారు. లేదా వాళ్లు చెప్పినట్టు వోటుచేసి వాళ్లకు చూపించి డబ్బాలో వేయాలి.

రాయలసీమ జిల్లాలలో బాంబులు తుపాకులు పెట్టుకొని రౌడీ గుంపును పోగుజేసుకొని బెదిరించి బతికే వాడిదే పెత్తనం అయింది. వాడు హత్యలు చేసినా దొంగసారా వ్యాపారం చేసినా స్మగ్లింగ్ చేసినా బెదిరించి రౌడీ మామూళ్లు వసూలు చేసినా వాడే పెద్ద మనిషి. వాడు చేసిందే రాజకీయం. వాడు చెప్పిందే ప్రజాస్వామ్యం ఈ ముఠాదారుల మాట జవదాటి వేరొకరికి వోటు వేయడానికి వీలులేదు. ఏజెంట్‌గా కూర్చొనడానికి వీలులేదు.

ఈ నియమాన్ని తప్పితే దాడులు జరుగుతాయి. హత్యలు జరుగుతాయి. ఇళ్లు తగలబడతాయి. పొలాలు బీడుపడతాయి.

**అందరికీ వోటు హక్కు కల్పించడానికి ఈ పార్టీలు నిజాయితీగా ఒప్పుకుంటాయా? వోటుహక్కును ఈ అభ్యర్థులు నిజంగా గౌరవిస్తారా?**

**బలవంతం లేకుండా, బెదిరింపు లేకుండా, ఒత్తిడులు లేకుండా ప్రజలను, బీద ప్రజలను, దళిత ప్రజలను, స్వేచ్ఛగా వోటువేసుకోనిస్తారా?**

గుండెమీద చేయి వేసుకొని జవాబు చెప్పమనండి.

## ☆ సమాజంలో అందరికీ సమాన గౌరవం, హోదా కల్పిస్తారా?

ఒక్కవోట్ల విషయంలోనే కాదు. మన గ్రామాలలో, పట్టణాలలో నిత్య జీవితంలో మాల, మాదిగ, ఎరుకల, వడ్డెర, యానాది తదితర దళిత కులాలు నీచమయిన వివక్షతకూ అణచివేతకూ గురి అవుతున్నారు. వాళ్లను అగ్ర కులాల వాళ్ల వెలివేసి దూరం ఉంచుతారు. ఊరిలో ఏ నేరం జరిగినా వాళ్లనే అనుమానించి హింసిస్తారు . వాళ్ల చదువులో రాజకీయాలలో పైకివచ్చి బాగుపడితే అగ్రకులాల వాళ్ల సహించరు. అన్ని రకాలుగా అణచివేస్తారు.

అంటరానితనాన్ని కుల వివక్షతనూ భారత రాజ్యాంగం నిషేధించింది. ఈ నిషేధాన్ని ఉల్లంఘిస్తే శిక్షించడానికి పార్లమెంటు అనేక చట్టాలు చేసింది. అయినా ఈ దుర్మార్గం కొనసాగుతూఉంది. ..... ఏపార్టీ పరిపాలించినా కొనసాగుతూనే ఉంది.

ఎస్‌సి. ఎస్‌టి, బిసి కులాల వాళ్ల చదువులో ఉద్యోగాలలో రాజకీయాలలో పైకి రావడానికి అవకాశం కల్పించే రిజర్వేషన్లు ఉన్నాయి. వీటిని అమలు చేయడం ప్రభుత్వం బాధ్యత. ...............ఏపార్టీ పరిపాలించిన అది దాని బాధ్యతే.

కానీ ఏ పార్టీ పరిపాలించినా అది సరిగ్గా అమలు కావడం లేదు. విద్య ఉద్యోగ రంగాలలో అగ్రకులాలదే పైచేయిగా ఉంటూ ఉంది. ఏ పార్టీ పరిపాలించినా ఉంటూ ఉంది.

**ఈ వివక్షత గురించి ఈ పార్టీలు ఏమంటున్నాయి? తమ వైఫల్యాన్నీ , నిర్లక్ష్యాన్నీ నిజాయితీగా ఒప్పుకుంటాయా? నిజాయితీగా ఒప్పుకోకపోతే ఈ రోజు ఈ అభ్యర్థికో ఆ అభ్యర్థికో వోటు వేసి దళితులు, గిరిజనులు. వెనుకబడిన కులాల ప్రజలు పొందేదేముంది?**

## ☆ సంక్షేమ చట్టాలు, విధానాలు అమలు చేస్తారా?

ప్రజలు పట్టుదలగా పోరాటాలు చేస్తే వారిని సమాధాన పరచడానికి ప్రభుత్వాలు సంక్షేమచట్టాలు చేస్తుంటాయి. చట్టాల రూపంలో, జీవోల రూపంలో సంక్షేమ విధానాలు ప్రకటిస్తుంటాయి.

ఒకసారి ప్రకటించిన తరువాత అది ప్రజల హక్కు అవుతుంది. దానిని అమలు చేయడం ప్రభుత్వం బాధ్యత అవుతుంది.

ఏ సంక్షేమ విధానమయినా, చట్టమయినా అమలయిందా? ఎవరు పరిపాలించినా అమలయిందా?

భూమి కోసం పేదలు పోరాటం చేస్తే భూసంస్కరణ చట్టాలు చేసారు. భూస్వాముల భూములు పేదలకు పంచుతామన్నారు.

నూరు ఎకరాలలో ఒక్క ఎకరం పంచారు.

సాగునీటి కోసం రైతులు పోరాడితే ప్రాజెక్టులు కడతాం, చెక్‌డాంలు నిర్మిస్తాం, బావులు తవ్వుకోవడానికీ బోర్లు వేసుకోవడానికీ అప్పులిస్తాం అన్నారు.

నూటికి అరవై ఎకరాలు ఇంకా మెట్టసాగుకిందనే ఉన్నాయి. మరి ప్రాజెక్టులు ఏమయ్యాయో అడగండి. చెక్‌డాంలను ఏ కొండచిలువమింగేసిందో అడగండి. చెరువులు, కాలువలు ఎందుకు పూడిపోయాయో అడగండి.

పూరిపాకలలో బతకలేమనీ ఇల్లు కావాలని పేదలు కోరుకుంటే ఇళ్లకాలనీలు కట్టిస్తామన్నారు. దానికోసం జీవోలు చేసారు. అధికార్లను నియమించారు. కానీ అవసరమైన దానిలో అయిదవ వంతు కూడ మంజూరు కాకపోగా ఆ మంజూరయినది కూడ రాజకీయ నాయకుల కోటాలో వాళ్ల ఆశ్రితులకే చెందింది. మిగిలిన జనం పూరిపాకలలోనే ఉంటున్నారు.

ఇట్లా చెప్పుకుంటూ పోతే ఎంతయినా చెప్పుకోవచ్చు. కూడు, గూడు, గుడ్డ, ఆరోగ్యం ,ఉద్యోగం, విద్య మొదలయిన అన్ని రంగాలలో సంక్షేమ చట్టాలు చేసారు. సంక్షేమ విధానాలు ప్రకటించారు.

ఈ సంక్షేమ చట్టాలు విధానాలు వాళ్ల దయతో ఇచ్చినవికావు. మనం కొట్లాడితే ఇచ్చినవి. మనం కొట్లాడి పొందినవి. వాటిని అమలు చేయించుకోవడం మన హక్కు. అమలు చేయడం ప్రభుత్వం బాధ్యత.

ఏపార్టీ చేతిలో ప్రభుత్వం ఉంటే ఆపార్టీ బాధ్యత ....... ఏ రాజకీయనాయకుడి చేతిలో అధికారం ఉంటే ఆ రాజకీయనాయకుని బాధ్యత.

ఈ బాధ్యతలో ఇన్నేళ్లుగా విఫలం అయ్యామని ఈ పార్టీలు, అభ్యర్థులు ఈ రోజు నిజాయతీగా ఒప్పుకుంటారా?

మనం పోరాడి సాధించుకున్న హక్కులను మనకు కల్పించడంలో తాము విఫలమైనామని ఈ నాయకులు ఒప్పుకుంటారా? ఊరికే వోట్లకోసంఒప్పుకోవడం కాదు. విఫలమైనందుకు ప్రజలకు పరిహారం చెల్లించుకుంటారా? రేపుమళ్లీ విఫలం కాకుండ ఉండడానికి తమ పద్ధతులు, విధానాలు, ఏవిధంగా మెరుగు పరచుకుంటారో ఏ విధంగ మార్చుకుంటారో ప్రకటిస్తారా? బహిరంగంగా ప్రకటిస్తారా?

వేరే అన్ని సంగతులూ ఎందుకు. ఒక్క సారానిషేధం గురించి అడగండి. ప్రజలు, ముఖ్యంగా స్త్రీలు పోరాటం చేసి సాధించుకున్నది సారానిషేధం. దాన్ని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధి చూపించిందో అడగండి. ఎంతమంది కాంగ్రెస్ నాయకులే దొంగసారా వ్యాపారం చేస్తున్నారో అడగండి. వాళ్లలో ఎంత మంది ఈ మధ్య కాలంలో పార్టీఫిరాయించి తెలుగు దేశంలో చేరారో అడగండి. **రెండు పార్టీలనూ ఈ ప్రశ్న అడగండి అడిగి చూడండి.**

## ☆ పోలీసుల నుండి ప్రజలకు రక్షణ కల్పిస్తారా?

శాంతి భద్రతలను కాపాడవలసిన పోలీసులను చూస్తేనే ప్రజలలో అశాంతి అభద్రత పెరుగుతాయి. అది ప్రజల తప్పుకాదు. దేశంలో పోలీసు యంత్రాంగం అట్లా తయారయింది. పీడక యంత్రాంగంగా తయారయింది.

ఏపార్టీ పరిపాలించినా ఈ విషయంలో తేడా లేదు. ఎంఎల్‌ఏ ఎవరయినా ఎంపి ఎవరయినా పోలీసు యంత్రాంగం ప్రజలతో ప్రవర్తించే పద్ధతిలో మార్పులేదు.

పెద్ద నేరస్తులను పోలీసులు ఎప్పుడూ హింసించరు. ఎరువులు కల్తీ చేసే వాళ్లను, లంచగొండి అధికార్లను, బాంబులు వేసి ఎన్నికలలో రిగ్గింగ్ చేసే రాజకీయ నాయకులనుబ్యాంకులకు కోట్లరూపాయలు ఎగ్గొట్టే పారిశ్రామిక వేత్తలను పోలీసు లెప్పుడూ లాకప్పులో పెట్టి హింసించరు.

చిన్న చిన్న కేసులలో ఇరుక్కున్న చిన్న చితక జనాన్ని ప్రతిరోజూ లాకప్పులలో పెట్టి హింసిస్తుంటారు. పీడించి లంచాలు వసూలు చేసుకుంటారు.

దీని నుండి ఏ పార్టీ రక్షణ కల్పిస్తుంది?

ఏపార్టీ తాను అధికారంలో ఉన్నప్పుడు రక్షణ కల్పించింది? ఏ ఎంఎల్ఏ తన నియోజక వర్గంలో ప్రజలను పోలీసుల చిత్రహింసల బారినుండి కాపాడతాడు?

తనకు గిట్టని వాళ్లను పోలీసులకు పట్టిచ్చి తన్నించిన నాయకులున్నారు గానీ ప్రజలను చిత్రహింసలనుండి కాపాడిన నాయకులు ఎవరు?

పోలీసు కస్టడీలో జరిగే హింస ఫలితంగా మన రాష్ట్రంలో ప్రతీ సంవత్సరం 20 నుండి 25 మంది చనిపోతుంటారు. ఏ పార్టీ రాష్ట్రాన్ని పరిపాలించినా దీనిలో మార్పులేదు.

లాకప్ హత్యల గురించి ఈ పార్టీలు ఏమంటాయి? ఆపుతామని ఒకరయినా హామీ ఇవ్వగలరా? ఇచ్చి నిలబెట్టుకోగలరా?

లాకప్పులో ప్రజలను హింసించే పోలీస్ అధికారులను ఏ ప్రభుత్వమూ శిక్షించలేదు. తాము ప్రతిపక్షంలో ఉంటే మాత్రం ఆందోళన చేస్తారు. అధికారంలోకి రావడానికి ఆ ఆందోళనను ఉపయోగించుకుంటారు. అధికారంలోకి వచ్చినాక అంతా మామూలే.

కాదని ఏ పార్టీ అయినా అనగలదా? ఏ అభ్యర్ధి అయిన అనగలడా? .............**అడిగి చూడండి.**

## ☆ స్త్రీల బ్రతుకులను ఎప్పుడు బాగుచేస్తారు?

భరతమాత అని ఒకరు ఆడపడుచని ఒకరు స్త్రీని అందరూ అందలం ఎక్కించే వారే.

కానీ స్త్రీగా ఆమె బతుకును బాగు చేసిన వారు లేరు.

సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని చట్టం చెప్తుంది. కానీ ఎక్కడయిన ఎప్పుడయినా మగవాడితో సమానంగా పనిచేసే స్త్రీకి దక్కేది రూపాయలో ముప్పావలా లేకపోతే అర్ధరూపాయి.

దీనిని ఏ ప్రభుత్వం మార్చింది? ఏ ఎంఎల్ఏ దీని గురించి ఆందోళన చేసారు?

ఉద్యోగాలలో స్త్రీలకు రిజర్వేషన్లు ఇదిగో ఇస్తున్నాం అదిగో ఇస్తున్నాం అని ప్రకటిస్తున్నారు. కానీ చట్టం చేయడానికి వీళ్లకు పాపం చేతులాడడం లేదు. పోనీ చేసిన చట్టాలయినా అమలు చేస్తున్నారా?

వరకట్నాన్ని నిషేధించి చాలా ఏళ్లయింది. కానీ, కట్నం ఇవ్వకుండ తీసుకోకుండ రాజకీయ నాయకుల ఇండ్లల్లో సహితం పెళ్లిళ్లు జరగడం లేదు. వరకట్న సంస్కృతిని పోగొట్టడానికి ఏ పార్టీ ఏం చేసింది?

మొగుడి చేతిలో మొగుడి ఇంటివారి చేతిలో హింస అనుభవించని స్త్రీలు అతి కొద్దిమంది. ఈ హింసను అరికట్టడానికి ప్రత్యేకమైన చట్టాలు చేసారు. కానీ ఎక్కడ అమలవుతున్నాయి?

మన రాష్ట్రంలో ప్రతీ సంవత్సరం సగటున 2500 మంది స్త్రీలు భర్త ఇంట్లో 'అనుమానాస్పదంగా' మరణిస్తున్నారు. అంటే ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ భర్త చేతిలో, భర్త బంధువుల చేతిలో హింసకు గురయి మరణిస్తున్నారు.

ఇన్ని హత్యలకు ఎంతమంది భర్తలు ఉరికంబం ఎక్కారు? ఈ హింసకు తగిన శిక్ష వేయడానికి ఏ ప్రభుత్వం ఎంత ప్రయత్నం చేసింది?

ఈ హింస చట్టాలతో పోయేది కాదు. మన సమాజంలో స్త్రీ స్థితిగతులు మారాలి. స్త్రీ పట్ల సమాజం వైఖరి మారాలి. దీని కోసం ఏ ప్రభుత్వం ఎంత కృషి చేసిందో అడగండి. రేపు ఏం చేయబోతుందో అడగండి.

ఏరోజయినా ఏ జిల్లాలోనైనా 'రేప్' కేసు ఒక్కటి కూడ నమోదు కాకుండా ఉండదు. దిన పత్రికలు తిరగేస్తే ఈ సంగతి అర్థం అవుతుంది. 'రేప్' కు చట్టం కఠినమయిన శిక్ష నిర్దేశించింది. కానీ ఎంతమందికి శిక్షపడింది?

ఇదికూడ కేవలం చట్టాలతో పోయేది కాదు. కానీ వేరే ఏదయినా కృషి చేయడానికి ఈ పార్టీలు ప్రయత్నిస్తున్నాయా? స్త్రీపైన లైంగిక హింసను పెంచే సినిమా సంస్కృతి, సాహిత్యం విచ్చలవిడిగా వర్ధిల్లుతున్నాయి. వాటిని అరికట్టడానికి ఏ ప్రభుత్వం ఏం చేసింది?

• ప్రజా ఉద్యమాలను ఆందోళనలను అణచడానికి చూపించే ఆసక్తిలో పదవ వంతయినా ఏ ప్రభుత్వమయినా స్త్రీ వ్యతిరేక సాహిత్యాన్ని సంస్కృతిని అరికట్టడంలో చూపించిందేమో అడగండి. ............**రేపు చూపిస్తుందేమో అడగండి.**

## ☆ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తారా?

వ్యవసాయ కూలీలకు ఉద్యోగ భద్రత ఎట్లాగూ లేదు. వానలు పడితే ,చెరువులు నిండితే, కాలవలు పారితే, బావులలో నీళ్లు ఊరితే ,వ్యవసాయకూలీలకు సంవత్సరంలో మూడునెలల నుండి ఆరునెలలు దాకా పని దొరుకుతుంది. మిగిలిన కాలం పనులు వెతుక్కుంటూ వలసపోవలసిందే.

దీనికి పరిష్కారం ఏ ప్రభుత్వమూ ఇప్పటి దాక చూపించలేదు. అందరికీ నిత్యం ఉపాధి దొరికే ఆర్థిక విధానం మన పాలకులకు ఇప్పటిదాకా దొరకలేదు.

పోనీ ఫ్యాక్టరీ కార్మికులకయినా చట్టం ప్రకారం కల్పించవలసిన ఉద్యోగ భద్రత కల్పిస్తారా? ఎన్నాళ్లయినా ఎన్నేళ్లయినా కార్మికులను పర్మనెంట్ చేయకుండ ఇష్టమొచ్చినట్లు తీసిపారేసే యజమానులను అడ్డుకుంటారా? కార్మికులు కొంచెం ఎదురు తిరిగి ప్రశ్నిస్తే వెంటనే రిట్రెంచ్ చేసి ఇంటికి పంపించే

యజమాన్లను అటకాయిస్తారా? కార్మికులు సంఘం పెట్టుకుంటే మిల్లుకు తాళం వేసి లాకౌట్ ప్రకటించే యజమాన్ల ఆట కట్టిస్తారా? అప్రెంటిస్‌కు ఇచ్చిన జీతమే 10 సంవత్సరాల అనుభవం ఉన్న కార్మికులకు కూడ ఇచ్చి వెట్టి చాకిరీ చేయించుకునే యజమానుల మెడలు వంచి ఉత్పత్తికి తగిన జీతం ఇప్పిస్తారా? మిల్లు ఆస్తులను కొల్లగొట్టి ఖాయిలా చేసి వేల మంది కార్మికులను ఇంటికి పంపించి వేసే యజమాన్లను శిక్షిస్తారా?

ఇప్పటి వరకు ఇవన్నీ ఏ ప్రభుత్వమూ చేయలేదు మరి. ఈ సమస్యలన్నీ ప్రతిరోజు కంపెనీ కార్మికులు ఎదుర్కుంటూనే ఉన్నారు. ఆ కంపెనీ యజమానులంతా పెద్దమనుషులు. వాళ్లే రాజకీయ నాయకులు, లేకపోతే రాజకీయ నాయకుల స్నేహితుల, బంధువులు. వాళ్లే రాజకీయ పార్టీల పోషకులు.

మరి ఈ పార్టీలు ఈ అభ్యర్థులు తమ స్నేహితులు, తమ పోషకులు అయిన కంపెనీ యజమానులను శిక్షిస్తారేమో అడగండి. ఇన్నాళ్లూ వాళ్లను ఎందుకు శిక్షించలేదో అడగండి. కార్మికుల హక్కుల కోసం ఎందుకు వీళ్లెవ్వరూ పోరాడలేదో అడగండి. **కార్మికులు వీళ్లను నమ్మి వోటు ఎందుకు ఇవ్వాలో అడగండి.**

## ☆ ఉద్యమించే హక్కును గౌరవిస్తారా?

ప్రజలకు ఈ ప్రభుత్వాలు వేరే ఏమీ ఇవ్వకపోయినా ఉద్యమించే హక్కును గౌరవిస్తే అదే పదివేలు. ప్రజలు ఉద్యమించి సాధించుకోగలరు.

కానీ ఉద్యమం అంటేనే లాఠీలు బయటికి తీయడం మన ప్రభుత్వాలకు అలవాటయిపోయింది.

ఏపార్టీ అధికారంలో ఉన్నా ఈ విషయంలో తేడా లేదు. ఉందంటారేమో ఈ అభ్యర్థులను అడిగి చూడండి. గుండె మీద చేయి వేసుకొని చెప్పమనండి. గుడ్డి వాళ్లపైన లాఠీచార్జి, కార్మికులపైన కాల్పులు నక్సలైట్ కార్యకర్తల ఎన్‌కౌంటర్ హత్యలు ఇవన్నీ రోజూ పేపర్‌లో చదువుతున్న వార్తలేకదా.

తెలంగాణా గ్రామాలలో యువకులను ఇంటినుండి తీసుకుపోయి ఊరిబయట కాల్చి చంపి 'ఎన్‌కౌంటర్ జరిగిందంటున్నారు. ఈ నాలుగు సంవత్సరాలలో 550 మందిని ఈ విధంగా చంపారు.

అంతకు ముందు కూడ ఇదే విధంగా చంపారు.

ఏపార్టీ రాష్ట్రాన్ని పరిపాలించినా ఇదే విధంగా చంపారు.

ప్రభుత్వం చంపమనకపోతే పోలీసులు ఇంతగా చంపరు కాబట్టి ఇది ప్రభుత్వ విధానంగా జరుగుతున్నదనేది స్పష్టమే.

ఈ విధానాన్ని ఎందుకు అనుసరిస్తున్నారో ఈ పార్టీలను అడగండి. నక్సలైట్లు హింస చేస్తున్నారు కాబట్టి వాళ్లను కాల్చి పారేస్తే తప్పులేదంటారేమో. అయితే తమ పార్టీవాళ్లు హింసచేస్తే కూడ కాల్చి పారేయొచ్చునని ఒప్పుకుంటారేమో అడగండి. అట్లాగయితే అధిక భాగం ఎంఎల్‌ఏలనూ, ఎంఎల్‌ఏల అనుచరులనూ కాల్చి పారేయవలసి ఉంటుందని చెప్పండి.

'నక్సలైటు' అనగానే వాళ్లకు ఏ హక్కులూ లేనట్టు ప్రభుత్వాలు ప్రవర్తిస్తున్నాయి. ఏ పార్టీ పరిపాలించినా ఈ విషయంలో తేడా లేదు. వాళ్లు సభలు పెట్టుకోవడానికి వీలులేదు. శాంతి యుతంగా ఊరేగింపులు తీయడానికి వీలులేదు. ఎన్నికలలో తమ అభ్యర్థిని నిలబెట్టుకోవడానికి వీలులేదు. నిలబెట్టుకుంటే వోట్లు వేయడానికి వీలులేదు. వోట్లు వేస్తే వీపులు పగులుతాయి. ఎన్‌కౌంటర్లు జరుగుతాయి.

పోనీ ఎన్నికలు బహిష్కరిస్తామని వాళ్లంటే ఎన్నికలు బహిష్కరించడానికి కూడ వీలులేదు. బహిష్కరిస్తే వీపులు పగులుతాయి ఎన్‌కౌంటర్లు జరుగుతాయి ఇదంతా ఏ చట్టం ప్రకారం జరుగుతున్నదో అడగండి. కొన్ని పార్టీలకు మాత్రమే హక్కులుంటాయనీ మిగిలిన వాళ్లకు ఉండవనీ ఏ చట్టంలో రాసి ఉందో అడగండి.

ఒక్కనక్సలైట్లకే కాదు. సారావ్యతిరేక ఉద్యమకారులు , కార్మిక సంఘాలు , ఉద్యోగుల సంఘాలు, నిరుద్యోగుల సంఘాలు, కష్టజీవుల సంఘాలన్నీ ప్రతిరోజు నిర్బంధానికి గురి అవుతున్నాయి.

ఊరేగింపులను ఏ చట్టం నిషేధించింది?
ధర్నాలను ఏ శాసనం నిషేధించింది?
బహిరంగ సభలను ఏ రాజ్యాంగం నిషేధించింది?
పికెటింగ్ నేరమని ఏ నేరస్మృతి చెప్పింది?

అని ఈ పార్టీలను అడగండి. ఎవరు అధికారంలో ఉన్నా జరిగింది ఇదే కాబట్టి అందరినీ అడగండి. కాంగ్రెస్ పార్టీని అడగండి. తెలుగుదేశం పార్టీని అడగండి. దాని మిత్రపక్షాలను కూడ అడగండి.

ఇంకా ఇటువంటి ప్రశ్నలు మీకు అనేకం తోస్తాయి. కరువు, నిరుద్యోగం, దారిద్ర్యం, ఆకలి, వివక్షత, అణచివేత రాజ్యమేలుతున్న ఈ దేశంలో అధికారం కావాలని ముందుకొచ్చే నాయకులను అడగడానికి ప్రశ్నలకు కరువులేదు.

అడగండి | ప్రశ్నించండి | నిలదీయండి

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించే నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థను సాధించుకోండి.

30 అక్టోబర్ 1994

**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం**

1994 అక్టోబర్ 30 నుండి నవంబర్ 6 వరకు రాయలసీమ జిల్లాలలో జరిగే పౌరహక్కుల ఎన్నికల ప్రచార యాత్రను జయప్రదం చేయండి